# ప్రశ్న

రచయిత:

శ్రీ గిర్రాజు రామారావు

ప్రభాకరుని ప్రథమకిరణములు నాగదిలో నా కండ్లయెదుట నాటలాడుకొనుచున్నపుడు నా సమీపమున మధురమందస్మితవదనముతో నన్నేల పలుకరించెదవు? నిద్దురమత్తులోగూడ జూడగల సుకుమారి నీవే కావలెనని నీవు కోరుదువా? అటు చూడుము. పవనుడెవ్వరివియోగవ్యథాభారమున నికుంజవనమున బిచ్చియెత్తినట్లు తిరుగుచున్నాడో!

ప్రాతఃకాలమున పక్షుల మధురగానము నాలించుచున్నపుడు, నా చెవులదగ్గర ప్రభాతగానమును ప్రారంభించెదవేల? నా శుష్కహృదయమున నానందప్రవాహమును ప్రవహింపజేయగలది మరియొకటి లేదనియా? అటు చూడుము. ఎవ్వరి హృదయము నానందపెట్టుటకు ఉపవనమున పకపకనవ్వుచున్నది కుసుమము?

సూర్యు డాకాశమున దన సాధారణపు త్రోవనే పోవును. అప్పుడు నీస్నేహవాత్సల్యమందటిపై కిబోవు నెందులకు? దానము, పరోపకారమును బోధింపదలంతువా? నీ కిచ్చుటయే గాని పుచ్చుకొనుట యెరుగవా? చూడుము? అంధకారమునుపుచ్చుకొని యెవరిని ప్రకాశింపజేయుటకు తార మిణుకుమిణుకులాడుచున్నది?

సూర్యుని తాపములోకలసి శీతలవాయువు ప్రవహించునప్పుడు పీడితహృదయముల చెంత జేరెదవేల? నీ స్పర్శచే శాంతివహింపగలననియా? చూడుము. చంద్రిక ప్రకాశించి మాలతీవనమును మత్తెక్కించినది. కోమలతరుణీమణి చంచలనయనముల నృత్యము చేయుచున్నది. నీవు నా హృదయముయొక్క హృదయములో డాగినంతవరకు నాకు శాంతిలేదు.

సాయంకాలపు నీడలు నాలుగుప్రక్కలకు బరిగెత్తునపుడు నీవును జేతులుచాచుకొని నా వైపు పరిగెత్తుకొని వత్తువేల? అభయమునకాలేక శరణుకా? నీధైర్యమును జూచుకొని యే నిశాదేవిని యాహ్వానించుచున్నాను. చూడుము. పాపము విచారించుచు ప్రకృతీభవనమున నొంటరిగా తిరుగాడు నిర్ఝరి నాకు స్నేహితురాలు.

అంధకారము, నిశ్శబ్దము సర్వత్ర వ్యాపించినప్పుడు అత్యంతతత్పరతతో నాయాత్మరక్షణార్థమువలె పరిగెత్తుకొని వత్తువేల? నీనేత్రజ్యోతిలో గాఢాంధకారమును బెగల్చి చూడగలుగుచునే యున్నాను లెమ్ము. చూడుము. చపలాకుమారి రంగులకాంతులను జూచి నవ్వుచున్నది.

అర్ధచంద్రుడు మేఘములచాటున నుండి తొంగిచూచునప్పుడు నాకదియేమియో చిన్నతనపు ఆటలు జ్ఞాపకము వచ్చుచున్నవి. ఈ మనుజప్రపంచోద్యానముననే వనమాలి వసించుచున్నాడు. అతనిదే గదా ఈలీలయంతయు. ఓహో! ఒక్కదినములో నాకుగావలసిన పాఠము దొరకినది. నీ స్థూలశరీరము నాకు దొరుకకపోయినను నీలోని స్థిరమైన వస్తువును నాదగ్గరనే యుంచుకొందును. నీ కొకనమస్కారము.